క్లుప్తంగా

రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించాలి

నకరికల్లు: అకాలవర్షాలకు పంటను నష్టపోయిన రైతుల జాబితాను ఆయాగ్రామాల సచివాలయాల్లో ప్రచురించి అభ్యంతరాలు స్వీకరించాలని తహసీల్దార్ ఎస్.సురేష్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వీఆర్వోలు, వీఆర్ఏల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కౌలురైతులను గుర్తించి సీసీఆర్‌సి కార్డులు మంజూరు చేయాలన్నారు. ఎలక్షన్ క్లెమ్స్ దరఖాస్తులను విచారణ చేసి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. మ్యుటేషన్ దరఖాస్తులను నిర్ణీత కాలవ్యవధిలో విచారణ చేసి తహసీల్దార్ కార్యాలయానికి నివేదిక పంపాలన్నారు. నిత్యావసర సరుకులను యండియు వాహనం ద్వారా కార్డుదారులకు ఇబ్బంది లేకుండా సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, వీఏఏలు పాల్గొన్నారు.

ఈ నెల 30లోపు ఈకేవైసీ నమోదు చేసుకోవాలి

ముప్పాళ్ళ: పీఎం కిసాన్ సామాన్ యోజన పథకం ద్వారా లబ్ధి పొందేందుకు అర్హులైన రైతులు ఈ నెల 30లోపు ఈకేవైసీ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎమ్.అరుణ మంగళవారం చెప్పారు. మండలంలో మొత్తం 7,210 మంది రైతులకు గాను ఇప్పటి వరకు 5,749 మంది రైతులు మాత్రమే ఈకేవైసీ నమోదు చేసుకున్నారన్నారు. మిగిలిన 1,461 మంది రైతులు గ్రామంలోని ఆర్బీకేలో ఈకేవైసీ నమోదు చేసుకోవాలన్నారు. లేకుంటే వారి ప్రభుత్వం అందించే రైతుభరోసా సాయం అందకుండా పోతుందన్నారు. వేలిముద్రలు పడని వారు ఫేసియల్‌యాప్ ద్వారా కూడా ఈకేవైసీ నమోదు చేసుకునే వీలుందన్నారు. రైతులు త్వరితగతిన ఈకేవైసీ నమోదు చేసుకోవాలన్నారు.

తొండపిలో ఫ్యామిలీ పిజిషియన్



తొండపి(ముప్పాళ్ళ): మండలంలోని తొండపి గ్రామంలో ఫ్యామిలీ పిజిషియన్ కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణ పాల్గొని 104 మందికి వైద్యసేవలందించారు. గర్భిణులకు, బాలింతలకు అవసరమైన వ్యాక్సిన్‌లను అందించారు. బీపీ, షుగర్, రక్తపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందించారు. మంచానికే పరిమితమైన వారి ఇళ్ళకు వెళ్లి పరీక్షించి అవసరమైన మందులను అందించారు. డీఈఓ రవితేజ, సీహెచ్‌ఓ సుగుణ, ఎమ్‌పీహెచ్‌ఏ ఎమ్.రవిచంద్రబాబు, ఏఎన్‌ఎమ్ రాజకుమారి, అంగన్‌వాడీ ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సేవావజ్ర అవార్డుకు మరో వలంటీరు ఎంపిక



అచ్చంపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వలంటీరు వ్యవస్థలో మరో వలంటీరు సేవావ్రజ అవార్డుకు ఎంపికై నాడు. కొండూరుకు చెందిన నామాల ఉదయ్‌కుమార్ వరుసగా రెండవసారి సేవా వజ్ర అవార్డుకు ఎంపికైనాడు. ప్రతి మండలం నుంచి ఒక్కరు మాత్రమే సేవావజ్ర అవార్డుకు ఎంపిక కావలసి ఉండగా అచ్చంపేటకు చెందిన సందెపోగు లింకన్‌ను ఎంపికచేశారు. అయితే ఉదయ్‌కుమార్ తన పరిధిలోని గృహాలవారికి నిత్యం అందుబాటులో ఉంటూ సేవాదృక్పథంతో, అంకిత భావంతో పనిచేసినందుకు గాను గత యేడాది సేవావజ్రకు ఎంపికై పలువురి ప్రశంసలు అందుకున్నారు. అదే స్ఫూర్తితో ఈ యేడాది కూడా పనిచేస్తున్నందున మిగిలిన వలంటీర్లందరు ఆదర్శంగా భావించాలన్న తలంపుతో ఈ యేడాది కూడా సేవావజ్రకు ఎంపికచేశారు.

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం



నకరికల్లు: గుర్తుతెలియని దుండగులు పల్నాడు జిల్లా నకరికల్లులోని ప్రైవేటుబ్యాంకు ఏటీఎంలో చోరీకి విఫలయత్నం చేశారు. స్థానిక అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారి పక్కన మంగళవారం తెల్లవారుఝామున చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి ఎస్ఐ పి.సురేష్ తెలిపిన వివరాల మేరకు రోడ్డు వెంబడే గల ఏటీఎంలో ప్రవేశించిన గుర్తుతెలియని దుండగులు ఏటీఎం స్క్రీన్ కిందభాగాన్ని ధ్వంసం చేశారు. అందులోని నగదు రాకపోవడంతో అక్కడి నుంచి పరారయ్యారు. బ్యాంకు సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్లూస్‌టీం, వేలిముద్రల నిపుణులు రంగంలోకి దిగారు. ఘటనాస్థలాన్ని పరిశీలించి సీసీ ఫుటేజీ సహాయంతో ఆధారాలు సేకరిస్తున్నట్లు ఎస్ఐ పి.సురేష్ తెలిపారు. ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వేసవి శిక్షణ.. విజ్ఞానార్జన

నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే చిన్నారులకు ఈ వేసవి సరదాలను పంచుతుంది. ఒకప్పటి రోజుల్లో అయితే అమ్మమ్మ వాళ్ల ఇళ్లకు వెళ్లే వారు. ప్రస్తుతం విద్యార్థులకు ఆటవిడుపు కార్యక్రమమే లేదు. దొరికిందల్లా ఒక్కటే సెల్‌ఫోన్. అందులో ఒక్కసారి తలదూర్చితే మళ్లీ ఎప్పటికి తేరుకుంటారో తెలియని పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల దృష్ట్యా విద్యార్థులకు ఆసక్తిని కలిగించేలా గ్రంథాలయాలు వేసవి శిబిరాలకు శ్రీకారం చుట్టాయి. వారికి పుస్తక పఠనంపై ఆసక్తిని కలిగించడంతో పాటు, పలు రకాల అంశాలను వివరిస్తూ శిబిరంలో విద్యార్థులు ఉల్లాసంగా ఆస్వాదించేలా కార్యక్రమాలను చేపడుతున్నారు. వేసవి సెలవులు కావడంతో విద్యార్థులంతా ఇళ్ల వద్దనే ఉంటున్నారు. వారికి పుస్తక పఠనంపై ఆసక్తిని కల్గించడంతో పాటు .. విజ్ఞానాన్ని పెంపొందించు కునేలా గ్రంథాలయాలు వేదికగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

- గ్రంథాలయాల్లో చిన్నారుల సందడి
- పుస్తక పఠనం, విభిన్న కార్యక్రమాలు
- ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు

సత్తెనపల్లి: ఏడాది పొడవునా పాఠశాలల్లో తరగతి గదులకే పరిమితమైన చిన్నారులకు వేసవి సెలవులే ఆటవిడుపు. వీటిని చాలా మంది చిన్నారులు సద్వినియోగం చేసుకుంటున్నారు. టీవీ, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంటూ .. ఆట పాటలతో గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాల్లో తమ ప్రతిభకు పదును పెట్టుకుంటున్నారు. పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ శాఖా గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 8న ప్రారంభమైన శిబిరాలు జూన్ 11 వరకు కొనసాగనున్నాయి. భవిష్య పాఠశాలలో ఐఐటీ ఫిజిక్స్ అధ్యాపకుడు బండారు అంకమ్మరావు రిసోర్సుపర్సన్‌గా వ్యవహరిస్తూ విద్యార్థులకు పలు అంశాల పై తర్ఫీదు ఇస్తున్నారు.



పట్టణంలోని వైఎస్సార్ మెమోరియల్ గ్రంథాలయంలో శిక్షణ శిబిరంలో విద్యార్థులు



పట్టణంలోని వైఎస్సార్ మెమోరియల్ గ్రంథాలయంలో పుస్తకాలు

ఏఏ అంశాల్లో శిక్షణ ఇస్తున్నారంటే ...

- కథలు వినడం, చదవడం, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, పెద్దల నుంచి విన్న అముద్రిత కథలు చెప్పడం.
- భగవద్గీత శ్లోకాలు, ఆంగ్లపదాలకు అర్థాలు చెప్పడం, పొడుపు కథలు, గ్రంథాలయా ల్లో పుస్తకాలు చదివించడం.
- చరిత్ర పుస్తకాలు చదివించడం, ఇండోర్ గేమ్స్, యోగా, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్స్, థియేటర్ ఆర్ట్స్ వంటి సృజనాత్మక అంశాల్లో తర్ఫీదు.
- ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ ఇస్తున్నారు.

కొత్త విషయాలు తెలుసుకుంటున్నా



గ్రంథాలయాల్లో చదువుకుని పలువురు ఉన్నత స్థాయికి ఎదిగారని తెలుసుకున్నా. గతంలో గ్రంథాలయాలకు రాలేదు. వేసవి శిబిరాల నేపథ్యంలో పలు అంశాలపై పట్టు సాధిస్తున్నా. ఇక్కడ వేల పుస్తకాలు ఉన్నాయి. చదవడానికి మంచి వాతావరణం ఉంది. కొత్త విషయాలు తెలుసుకుంటున్నా.

–ఎస్.హేమంత్, విద్యార్థి, సత్తెనపల్లి

సమయం వృథా కాకుండా



వేసవి శిక్షణ శిబిరాలతో సమయం వృథా కావడం లేదు. ఉదయం నిర్ణీత వేళకు లైబ్రరీకి రావడం, వెళ్లడం అలవాటైంది. పఠనాసక్తి, విజ్ఞానాన్ని పెంచుకోవడం, వ్యాయామానికి ఉపకరిస్తోంది. అధ్యాపకుడు వచ్చి పలు సూచనలు చేస్తున్నారు. వివిధ విజ్ఞాన అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. శిక్షణకు స్పందన పెరిగింది

–ఎస్ ఆధ్యా, విద్యార్థిని, సత్తెనపల్లి

వేసవి శిక్షణకు స్పందన ఉంది



ప్రభుత్వం అమలుచేస్తున్న వేసవి శిక్షణ శిబిరానికి స్థానిక గ్రంథాలయంలో స్పందన ఉంది. విద్యార్థులు ఉత్సాహంగా హాజరవుతుండగా, వారి తల్లి దండ్రుల ప్రోత్సాహం ఉంది. ప్రభుత్వం తరఫున తాగునీరు, పుస్తకాలు వంటి వసతులు పూర్తి స్థాయిలో కల్పించారు. రిసోర్స్ పర్సన్ పుస్తక పఠనం పై శిక్షణ ఇస్తున్నారు.

–కె.వాణి, లైబ్రరీయన్, సత్తెనపల్లి

పిల్లల్లోని ఆసక్తిని గమనించి



వేసవి శిబిరాలు పిల్లల్లోని మానసిక ఒత్తిడిని తగ్గించడంతో పాటు నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఎంతగానో దోహద పడతాయి. పిల్లల్లోని ఆసక్తిని గమనించి శిక్షణ అందిస్తున్నాం. దీని వల్ల వారిలో నాయకత్వ లక్షణాలు పెరగడంతో గెలుపోటములను సమా నంగా స్వీకరించేతత్వం అలవడుతుంది.

– బండారు అంకమ్మరావు, రిసోర్స్‌పర్సన్, సత్తెనపల్లి

జగనన్న పక్కా గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలి

- సత్తెనపల్లి ఎంపీడీఓ సత్యనారాయణ
- మండలంలోని పక్కాగృహ నిర్మాణాల పై సమీక్ష

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పక్కా గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సత్తెనపల్లి ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సత్తెనపల్లి మండలంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో పక్కా గృహ నిర్మాణాలపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సత్యనారాయణ మాట్లాడుతూ సత్తెనపల్లి మండలంలో 1,739 గృహాలు మంజూరు కాగా ఇప్పటివరకు 786 గృహాలు పూర్తి అయ్యాయన్నారు. 550 గృహాలు వివిధ స్టేజీల్లో ఉన్నాయని వీటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. 200 గృహాలు ప్రారంభం కావాల్సి ఉందని, వెంటనే వీటి నిర్మాణాలు ప్రారంభించాలని సూచించారు. అలాగే మండల వ్యాప్తంగా 18 జగనన్న లేఔట్లు ఉంటే వీటిలో 731 గృహాలు మంజూరు కాగా 160 పక్కా గృహాలు పూర్తి కాగా 250 గృహాలు వివిధ స్టేజీల్లో ఉన్నాయని, అన్ని గృహ నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. తహసీల్దార్ కె.నగేష్ మాట్లాడుతూ గ్రామాల వారీగా ప్రతి ఒక్కరూ పక్కా గృహ నిర్మాణాల లక్ష్యాలను చేరుకోవాలన్నారు. మండలంలోని గ్రామాల వారీగా సమీక్ష చేసి సూచనలు చేశారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ ఏఈ సుబ్బారావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.



సమీక్ష చేస్తున్న ఎంపీడీఓ సత్యనారాయణ, పక్కన తహసీల్దార్ నగేష్,ఏఈ సుబ్బారావు

పేదరిక నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

సత్తెనపల్లి: పేదరిక నిర్మూలన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గార్లపాటి ప్రభాకర్ అన్నారు. అమ్మ చేయూత చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో దాత మోదుగుల బాబ్జి కుమారుడు మోదుగుల యశ్వర్ధ నరా జన్మదినం సందర్భంగా సత్తెనపల్లి పట్టణానికి చెందిన నిరుపేద మహిళలకు నిత్యావసర సరుకులు పంపిణీ మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభాకర్ మాట్లాడుతూ నిరుపేద మహిళలకు అండగా అమ్మ చేయూత చారిటబుల్ సొసైటీ పని చేయాలన్నారు. యువత సేవా గుణాన్ని అలవర్చుకోవాలన్నారు. అమ్మ చేయూత చారిటబుల్ సొసైటీ ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రెసిడెంట్, సభ్యులను అభినందించారు. ముందుగా నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు.



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న గార్లపాటి ప్రభాకర్

ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా పుల్లారావు

సత్తెనపల్లి: ఓబీసీ మోర్చా పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన గుడిపల్లి పుల్లారావును నియమించారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఈ నియామకం జరిగింది. తన నియామకానికి సహకరించిన వారికి పుల్లారావు కృతజ్ఞతలు తెలిపారు. పుల్లారావు మాట్లాడుతూ పల్నాడు జిల్లా వ్యాప్తంగా గల అన్ని మండలాలలో ఉన్న బీసీలను మేల్కొలిపి, బీసీల అభివృద్ధికి, సంక్షేమానికి ప్రధాని మోదీ కల్పించిన అవకాశాలను చిట్టచివరి లబ్ధిదారుడు కూడా అందుకుని హర్షించే విధంగా కృషి చేస్తాన న్నారు.

పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పల్నాడు క్రీడాకారుల ప్రతిభ

సత్తెనపల్లి: రాష్ట్ర స్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పల్నాడు క్రీడాకారుల ప్రతిభ చూపారు. తెనాలి నారాయణ కళాశాలలో రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు ఈ నెల 19 నుంచి మే 21 వ తేదీ వరకు మూడు రోజులపాటు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ సబ్ జూనియర్, జూనియర్ క్లాసిక్ మెన్ అండ్ ఉమెన్ క్రీడా పోటీలు ప్రతిష్టాత్మకంగా జరిగాయి. ఈ పోటీల్లో పల్నాడు జిల్లాకు చెందిన 9 మంది క్రీడాకారులు 4 బంగారు పథకాలను, 3 వెండి, ఒక బ్రాంజ్ పథకాన్ని కైవసం చేసుకుని పల్నాడు జిల్లా ప్రతిష్టలు చాటారు. సబ్ జూనియర్ విభాగం...53 కిలోల విభాగంలో సత్తెనపల్లికి చెందిన జి.ఎస్.వి.ప్రణీత్ వెండి పతకం, 53 కిలోల విభాగంలో గురజాలకు చెందిన కె.కార్తీక్ రజిత పతకం, 59కిలోల విభాగంలో సత్తెనపల్లికి చెందిన ఎండీ రఫీ వెండి పతకం,66 కేజీల్లో సత్తెనపల్లికి చెందిన షేక్ కరిం గోల్డ్ మెడల్, 66కేజీలో సత్తెనపల్లికి చెందిన షేఖ మోహిద్దీన్ వెండి పతకం కైవసం చేసుకున్నారు. జూనియర్ విభాగం .. 53 కేజీల విభాగంలో రొంపిచేర్ల కు చెందిన ఎం అనుష బంగారు పతకం,66 కేజీల విభాగంలో వెన్నాదేవీకి చెందిన ఎన్ శరత్ 4వ స్థానం, 83 కిలోల విభాగంలో సత్తెనపల్లికి చెందిన టీ.సాయి 5వ స్థానం, 120 కేజీల విభాగంలో గుడిపూడి కు చెందిన లింగిశెట్టి శివ నాగేశ్వర రావు 2 బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. పల్నాడు జిల్లా అసోసియేషన్ సెక్రటరీ, అంతర్జాతీయ క్రీడాకారుడైన పసుపులేటి సురేష్ శిక్షణలో మెళకువలు నేర్చుకొని ప్రతిభ చాటామని, భవిష్యత్తులో మరిన్ని పథకాలు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో సాధిస్తామని ఆత్మ విశ్వాసంతో క్రీడాకారులు ప్రకటించారు. సురేష్ ఉత్తమ శిక్షణ, ప్రోత్సాహాలను అందించడం వల్ల పల్నాడు జిల్లాలో పథకాలు సాధిస్తూ మిగిలిన జిల్లాలకు ఆదర్శంగా నిలిచామన్నారు.ఈ సందర్భంగా పలువురు క్రీడాకారులు, పట్టణ ప్రముఖులు కోచ్ పసుపులేటి సురేష్‌ను అభినందించారు. కోచ్ సురేష్‌ను, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు, పల్నాడు జిల్లా పవర్ లిఫ్టింగ్ ప్రెసిడెంట్ జొన్నలగడ్డ ఆనంద్, ఎస్ మణిరత్నం, టీ.శంకర్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాతంగి సాంబశివరావు, కత్తి పవన్, మాతంగి రాహుల్ గౌతమ్, జి రమేష్, శాంతయ్య, షేక్ జానీ, సయ్యద్ మస్తాన్, పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు క్రీడాకారులను అభినందించారు.



ప్రతిభ చూపిన క్రీడాకారులతో పసుపులేటి సురేష్

ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో వైద్య పరీక్షలు

సత్తెనపల్లి: ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా సత్తెనపల్లి మండలం అబ్బూరు గ్రామంలో ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ యు. శ్రీలక్ష్మి కవిత మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 186 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో జనరల్ ఓపి 35 మంది, హైపర్ టెన్షన్ 61 మంది, డయాబెటిస్ 39 మంది గర్భిణులు 14 మంది బాలింతలు ఇద్దరు ఉన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నడవలేని వారి ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి ఆరోగ్య బోధనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఎం.వెంకటేశ్వర్లు, ఎంఎల్‌హెచ్‌పీ బర్మా నాయక్, ఏఎన్ఎంలు ఎస్.కిరణ్ మై, ఎమ్.నాగేంద్రం, హెల్త్ అసిస్టెంట్ నరసింహారావు, డీఈఓ సుధాకర్, ఆశా కార్యకర్త శ్యామల, ఉన్నారు.

బృగుబండ గ్రామంలో....

ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా సత్తెనపల్లి మండలం బృగుబండ గ్రామంలో డాక్టర్ సాయి తేజ రెడ్డి మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 126 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో జనరల్ ఓపి 22 మంది, హైపర్ టెన్షన్ 45 మంది, డయాబెటిస్ 22 మంది, హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిస్ 19 మంది, గర్భవతులు 14 మంది, బాలింతలు నలుగురు ఉన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నడవలేక గృహాల్లోనే ఉన్న వారి ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి ఆరోగ్య బోధన చేపట్టారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఏ.వరలక్ష్మి ఎమ్ఎల్‌హెచ్‌పీ డి తిరుమలవేణి, ఏఎన్ఎం బి.కుమారి, హెల్త్ అసిస్టెంట్ బి.కిరణ్ కుమార్, డీఈఓ ఇజ్రాయిల్, ఆశ కార్యకర్తలు ఏ.రమాదేవి, వి.రమాదేవి, తదితరులు ఉన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీలక్ష్మి కవిత

ఉపాధిహామీని బలహీనపరచడం కోసమే బడ్జెట్‌లో కోతలు

- ఈ నెల 29న కలెక్టరేట్ వద్ద ఉపాధి హామీ మెట్ల ధర్నా
- వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి లక్ష్మీశ్వరరెడ్డి

సత్తెనపల్లి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని బలహీనపరచడం కోసం కేంద్రం బడ్జెట్‌లో భారీ కోతలు విధించిందని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వరరెడ్డి అన్నారు. పట్టణంలోని పుతుంబాక భవన్ ఆవరణలో మంగళవారం ఆయన ఉపాధి హామీ మేట్ల ధర్నా జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రం ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ పనైనా చూపండి తిండైనా పెట్టండి అనే నినాదంతో గత 60,70 సంవత్సరాలుగా ప్రజాతంత్ర శక్తులు, వ్యవసాయ కార్మిక సంఘం చేసిన పోరాటాల ఫలితంగా 2005లో వామపక్షాలు కేంద్రంలో బలంగా ఉన్నప్పుడు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం వచ్చిందన్నారు. నాటి నుంచి ఈ పథకం అమలులో అనేక భారీ ష్టాలు వచ్చాయని, ఎప్పటికప్పుడు వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధి పని ప్రదేశాల్లో కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి ప్రభుత్వం దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకువచ్చి ధర్నాలు, ఆందోళన చేసి ఈ పథకాన్ని మెరుగుపరచడానికి, ఆచరణలో సమస్యలను పరిష్కరించడానికి ఎంతో కృషి చేసిందన్నారు. మెట్ల వ్యవస్థ ద్వారా పనులు సాఫీగా సాగుతున్నాయని, ఈ దశలో కేంద్రంలో మోడీ ప్రభుత్వం వచ్చి పథకం అమలులో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న అధికారాలను బలహీన పరుస్తూ నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం అనే కంప్యూటర్ అప్లికేషన్ ద్వారా అన్ని విషయాలను ఢిల్లీలో ఉండి నిర్ణయిస్తున్నదన్నారు. రెండు పూటలా పని చేయాలని, బయోమెట్రిక్ విధానం అమలు చేయాలని, ఆధార్‌తో లింకు కావాలని, తదితర కొత్త కొత్త కఠిన నిబంధనలు తీసుకువస్తూ గతంలో ఉన్న మంచి నీళ్ళకి, పనిముట్లకి ఇచ్చే అలవెన్స్‌తో పాటు సమ్మర్ అలవెన్స్ కూడా రద్దు చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మేట్ల వ్యవస్థను రద్దుచేసి సైట్ సూపర్వైజర్లను పెడతామంటున్నారన్నారు. అది కూడా అమలు చేయలేదన్నారు. ఫలితంగా ఉపాధి హామీ పనులు అమలులో గందరగోళం తలెత్తిందనిన్నారు. పొమ్మన కుండా పొగ పెట్టినట్లుగా ఉపాధి హామీ పథకం వచ్చిన తరువాత వలసలు తగ్గిపోతాయని భావిస్తే, పల్నాడు జిల్లాలో వ్యవసాయం గిట్టు బాటు గాకా లక్షలాది ఎకరాలు ఒక వైపు ఏడారిగా మారుతుంటే మరో వైపు రియల్ ఎస్టేట్ వెంచర్లు పేర్లతో లక్షలాది ఎకరాల సారవంతమైన సాగుభూమిని ఇళ్ల స్థలాలుగా మారుస్తున్నారన్నారు. మరో వైపు వ్యవసాయంలో యాంత్రికరణ పెరగడం వల్ల వ్యవసాయంలో పని దినాలు రోజురోజుకీ తగ్గిపోతున్న పరిస్థితుల్లో ఉపాధి హామీ పథకం గ్రామీణ పేదలకు ఎంతో ఉపయోగంగా ఉందన్నారు. ఇటువంటి ఈ పథకాన్ని ఇంకా పట్టణాలకు విస్తరింప చేయాలని, 100 రోజుల స్థానంలో 200 రోజులు పని గ్యారెంటీ చేయాలని, వేతనాలు రూ. 600కి పెంచాలని, తదితర డిమాండ్లతో పథకాన్ని మరింత మెరుగు పరచు కోవడం కోసం కృషి చేస్తున్నామ న్నారు. ఈ పరిస్థితులలో ఉపాధి హామీ కూలీలు, మెట్లు, ఉపాధి సిబ్బంది అందరూ ఏకమై ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ఉందని ఆయన తెలిపారు. అందులో భాగంగానే వ్యవసాయ కార్మిక సంఘం ఇటీవల ఢిల్లీలో లక్షలాది మందితో నిరసన ప్రదర్శన చేసినట్లు ఆయన గుర్తు చేశారు. అందులో భాగంగానే ఈ నెల 29న నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ఉపాధి హామీ మెట్ల ధర్నాను జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కారుచోల రోశయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.ఆశీర్వాదం, బత్తుల బాలకోటయ్య, కొమ్ముల నాగేశ్వరరావు, దుగ్గి సుజాత, పటాన్ సైదా ఖాన్, ఏపూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా కరపత్రం ఆవిష్కరిస్తున్న అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, నాయకులు

నేటి నుంచి పెద్దింటమ్మతల్లి వార్షికోత్సవాలు ప్రారంభం



అమరావతి: ప్రసిద్ధ శైవక్షేత్రమైన అమరావతిలో వేంచేసియున్న గ్రామ దేవత పెద్దింటమ్మతల్లి వార్షికోత్సవాలు ఈనెల 24వతేదీన నిర్వహించటానికి నిర్వాహకులు మంగళవారానికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. తొలిరోజు బుధువారం వార్షికోత్సవ కార్యక్రమంలో విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం , పంచామృత స్నపన, విషేష కుంకుమార్చన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.అలాగే రెండవరోజు 25వ తేదీ గురువారం అమ్మవారికి కుంకుమార్చనలు ప్రత్యేక పూజల అనంతరం శ్రీలక్ష్మీగణపతిహోమం, శక్తిదుర్గాచండీహోమం అనందరం పూర్ణాహుతి నిర్వహిస్తారని తెలిపారు ఉదయం 11గంటల నుండి దేవాలయానికి వచ్చిన భక్తులందరికి అన్నసంతర్పణ జరుగుతుందని తెలియచేశారు. ఈ వార్షికోత్సవాల్లో భక్తులందరూ పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

విత్తనాలు అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవు

అమరావతి: ప్రభుత్వం నిర్ణయించిన ధరల కన్నా పత్తి, మిర్చి, ఇతర పంటల విత్తనాలను అధిక రేట్లకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి అహ్మద్ హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ షాపుల్లో స్టాకు రిజిస్టర్‌లను, బిల్లు పుస్తకాలను సక్రమంగా నిర్వహించాలన్నారు. కలుపుమందుతట్టుకునే బిటి విత్తనాల అమ్మకానికి అనుమతి లేదన్నారు. ఈ విత్తనాలను అమ్మకాలు జరిపితే చర్యలు తప్పవన్నారు. విత్తనాల, ఎరువుల స్టాకు పట్టికను ప్రతి రోజు బోర్డులో రాయాలన్నారు. రసీదులు లేకుండా విత్తనాలను రైతులు కొనుగోలు చేయవద్దని ఆయన సూచించారు. మిర్చివిత్తనాల్లో కొన్ని రఖాలు అధిక ధరలకు అమ్ముతున్నారని రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని ఎవరైనా విత్తనాలను అధిక ధరలకు అమ్మితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

ఎండీఎస్ ప్రకాశం జిల్లా అధ్యక్షుడిగా కిరణ్



సత్తెనపల్లి: మహాజన దళిత సమితి (ఎండీఎస్) ప్రకాశం జిల్లా అధ్యక్షునిగా ఒంగోలు టౌన్ కి చెందిన మాకం కిరణ్‌ను నియమించారు. ఈ మేరకు ఎండీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు దీపాల పరంధామయ్య నుంచి కిరణ్ మంగళవారం సత్తెనపల్లిలో నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ మాదిగ మహాజనుల అభివృద్ధికి కృషి కి చేస్తానన్నారు. ప్రకాశం జిల్లా పరిధిలో ఎండీఎస్ బలోపేతానికి పని చేస్తాన న్నారు. జిల్లా అధ్యక్షునిగా తన నియామకంకు కృషి చేసిన రీజినల్ కోఆర్డినేటర్ శాంతి రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎండీఎస్ రాష్ట్ర కార్యదర్శి జమండ్ల మూడి ప్రభాకర్, బాపట్ల,ప్రకాశం జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ శాంతి రాజు, పాల్గొన్నారు.

పాఠశాలల్లో సమ్మర్ క్యాంప్‌లు నిర్వహించాలి

ఎంఈఓ మల్లిఖార్జున శర్మ

బెల్లంకొండ: మండలంలోని అన్నీ గ్రామాల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సమ్మర్ క్యాంప్‌లను నిర్వహించాలని మండల విద్యాశాఖాధికారి బి.మల్లిఖార్జున శర్మ తెలిపారు. మంగళవారం మండలంలోని మాచాయపాలెం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌ను సందర్శించారు. క్యాంప్‌లో భాగంగా నిర్వహిస్తున్న 'వియ్ లవ్ రీడింగ్ ' కార్యక్రమ నిర్వహణ తీరును పరిశీలించారు. వేసవిలో విద్యార్థులు కొంత సమయం చదువుపై ఆసక్తి కనబరిచేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్న తరగుతుల విద్యార్థులు ఇంగ్లీష్, తెలుగు భాషలలో చదవడం, రాయడం వంటి వాటిని నేర్పించడం జరుగుతుందన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో కలసి విద్యార్థుల్లో సామర్థ్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బి.కృష్ణ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.